అభివృద్ధికి దూరంగా.. రెవెన్యూ పార్క్

ఇదీ పార్కు పరిస్థితి..

రెవెన్యూ పార్కులో పిల్లల ఆటపరికరాలు కొన్ని తుప్పుపట్టి విరిగిపోయాయి. ఇనుప బెంచీలు పాడయ్యాయి. వాటర్ ఫౌంటెయిన్ పూర్తిగా పనిచేయడం లేదు. దీని నుంచి వినిపించే మ్యూజిక్ మూగబోయింది. కళావేదిక పైకప్పు తుప్పుపట్టింది. దాని గోడలు పెచ్చులూడాయి. పార్కు లోపల ఫుట్‌పాత్‌లపై మధ్య మధ్యలో పలకలు ఊడిపోయాయి.



విరిగిన పిల్లల జారుడుబల్ల

- గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పార్కు ఆధునికీకరణకు శంకుస్థాపన
- రూ.2 కోట్ల నిధుల కేటాయింపు
- అధికారుల నిర్లక్ష్యంతో ఆగిన పనులు
- పునఃప్రారంభించాలని కోరుతున్న విశాలాక్షినగర్ వాసులు

ఆరిలోవ: జీవీఎంసీ తొమ్మిదో వార్డు విశాలాక్షినగర్‌లోని రెవెన్యూ పార్కు అధికారుల నిర్లక్ష్యానికి గురవుతోంది. ఒకప్పుడు సాంస్కృతిక కార్యక్రమాలు, స్థానికుల సందడితో కళకళలాడిన ఈ పార్కు.. నేడు దాని ఉనికిని కోల్పోయింది. ఇక్కడ ప్రతి రోజూ ఉదయం వందల మంది వాకింగ్ చేసేవారు. సాయంత్రం వేళలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించేవారు. ఇప్పుడు అవేవీ కనిపించక కొన్నేళ్లుగా ఈ పార్కు బోసిపోయింది. దీని వైపు జీవీఎంసీ అధికారులు కన్నెత్తి చూడటం లేదు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రారంభమైన ఈ పార్కు అభివృద్ధి పనులను సైతం నిలిపేశారు. 2024 ఎన్నికల అనంతరం కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక పూర్తిగా దీని ప్రస్తావన లేకుండా మరిచిపోయారు. దీంతో విశాలమైన రెవెన్యూ పార్కు కళావిహీనమై నిరుపయోగంగా మారింది.



పార్కులో పనిచేయని వాటర్ ఫౌంటెయిన్



విశాలాక్షినగర్‌లో కళావిహీనంగా రెవెన్యూ పార్కు



నిరుపయోగంగా కళావేదిక

కూటమి ప్రభుత్వంలో నిలిచిన పనులు..

ఈ పార్కు పునరుద్ధరణకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో జీవీఎంసీ రూ.2 కోట్లు కేటాయించింది. ఆ నిధులతో పార్కును ఆధునికీకరించాలని తలచింది. 2024 మార్చిలో అప్పటి విశాఖ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ, వార్డు కార్పొరేటర్ స్వాతి, విశాలాక్షినగర్ రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులతో కలిసి పార్కు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. కొద్ది రోజుల్లో పనులు జరగనున్న సమయంలో సాధారణ ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చింది. దీంతో జీవీఎంసీ అధికారులు దీని పనులు నిలిపేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పార్కు ఆధునికీకరణ ప్రస్తావనకు బ్రేక్ వేసేశారు.

పట్టించుకోవాలని స్థానికుల విజ్ఞప్తి

కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక రెవెన్యూ పార్కును అభివృద్ధి చేయాలని, శంకుస్థాపన అనంతరం నిలిచిపోయిన పనులను ప్రారంభించాలని విశాలాక్షినగర్ రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు స్థానిక ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబును కలిసి కోరారు. ఇంతవరకు దీని గురించి పట్టించుకోలేదు. పార్కు ఆధునికీకరణకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నిధులు కేటాయించిందనే ఉద్దేశంతో కూటమి ప్రభుత్వ నేతల ఆదేశాల మేరకు అధికారులు పట్టించుకోవడం మానేశారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రజా ప్రయోజనాల దృష్ట్యా పార్కును పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయాలని వారు కోరుతున్నారు.



2024లో పార్కు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ(ఫైల్)

నాడు కళకళ.. నేడు వెలవెల

ఈ ప్రాంతంలో అందరూ ఉన్నతులే. ఇక్కడ రెవెన్యూ అధికారుల కోసం ప్రత్యేకంగా కొన్ని దశాబ్దాల కిందట ప్రభుత్వం లేఅవుట్ వేసింది. దానిలోని స్థలాలను రెవెన్యూ అధికారులకు అప్పగించింది. సామాజిక అవసరాల్లో భాగంగా సుమారు రెండెకరాల స్థలంలో రెవెన్యూ పార్కు నిర్మించారు. కాలనీవాసులు ఉదయం, సాయంత్రం వేళల్లో నడక కోసం ఫుట్‌పాత్‌లు, సేదతీర దానికి ఇనుప బెంచీలు ఏర్పాటు చేశారు. పిల్లల ఆట పరికరాలు అమర్చారు. విశాలమైన కళావేదిక నిర్మించారు. దీనిపై నిత్యం సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతుండేవి. స్థానికులు, బయటవారు పుట్టినరోజు, పండగల వేడుకలు జరుపుకోవడం వల్ల దీనికి ఆదాయం కూడా చేకూరుతుండేది. పార్కు మధ్యలో ఏర్పాటు చేసిన వాటర్ ఫౌంటెయిన్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. వీటన్నింటితో ఒకప్పుడు రెవెన్యూ పార్కు కళకళలాడేది. ఇప్పుడా కార్యక్రమాలేవీ కానరావడం లేదు.

క్లుప్తంగా

నేడు జిల్లా స్థాయి సైన్స్ దినోత్సవం

విశాఖ విద్య: జాతీయ సైన్సు దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా స్థాయి వేడుకలను సోమవారం గోపాలపట్నం బాలుర హైస్కూల్‌లో నిర్వహిస్తున్నట్లు జిల్లా సైన్సు అధికారి కె.ప్రసాద్ తెలిపారు. క్విజ్, పోస్టర్ ప్రజెంటేషన్ అంశాలపై విద్యార్థులకు పోటీలు ఉంటాయన్నారు. ఇప్పటికే మండల స్థాయిలో జరిగిన పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులను జిల్లా స్థాయికి ఎంపిక చేయటం జరిగిందన్నారు. సుమారు 200 మంది విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొనే అవకాశం ఉందన్నారు. జిల్లాలోని సైన్సు ఉపాధ్యాయులు అంతా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

మానసిక వైద్య విద్యార్థినికి గోల్డ్ మెడల్



డాక్టర్ హర్షిత

బీచ్‌రోడ్డు: డాక్టర్ ఎన్టీఆర్ యూనివర్సిటీ పరిధిలో ఇటీవల జరిగిన పీజీ పరీక్షల్లో అత్యధిక మార్కులు 598 సాధించిన ఆంధ్ర వైద్య కళాశాల మానసిక విభాగం విద్యార్థిని డాక్టర్ కె.హర్షిత గోల్డ్ మెడల్ సాధించారు. రాష్ట్ర స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులకు అందించే డాక్టర్ గుంటూరు భాగ్యారావు బంగారు పతకాన్ని హర్షితకు ఇవ్వనున్నారు. రాష్ట్ర స్థాయిలో వరుసగా నాలుగో సారి మానసిక వైద్య విద్యార్థులు గోల్డ్ మెడల్ సాధించారని విభాగాధిపతి డాక్టర్ డి.,విజయలక్ష్మి, మానసిక ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.వి.రామిరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం హర్షితను అధ్యాపక బృందం, విద్యార్థులు అభినందించారు.

ఘనంగా పైడిమాంబ ఆలయ వార్షికోత్సవం



దుర్గా హోమంలో పాల్గొన్న భక్తులు

ఆరిలోవ: జీవీఎంసీ 10వ వార్డు పాత డెయిరీ ఫారంలో పైడిమాంబ అమ్మవారి ఆలయ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అర్చకులు సాయంత్రం అమ్మవారి సన్నిధిలో దుర్గా హోమం నిర్వహించారు. పాత డెయిరీ ఫారం, ఆదర్శనగర్ ప్రాంతాల నుంచి భక్తులు పాల్గొన్నారు. అనంతరం కమిటీ సభ్యులు భక్తులకు ప్రసాద వితరణ చేశారు. ఈ సందర్భంగా కమిటీ అధ్యక్షుడు రామ్‌లక్ష్మణ్ మాట్లాడుతూ ఈ నెల 3 నుంచి 11 వరకు పైడిమాంబ అమ్మవారి నవరాత్రి జాతర మహోత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. దీని కోసం ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



ముడసర్లోవ పార్కు సమీపంలో ఫుట్‌పాత్‌పై వ్యక్తి మృతదేహం

ఆరిలోవ: జీవీఎంసీ 13వ వార్డు పరిధి ముడసర్లోవ పార్కు సమీపంలో బీఆర్‌టీఎస్ ఫుట్‌పాత్‌పై గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. ఆదివారం రాత్రి అటుగా ప్రయాణించే వాహనచోదకులు సమాచారం ఇవ్వడంతో ఆరిలోవ పోలీసులు సంఘటనా స్థలం వద్దకు చేరుకున్నారు. మృతదేహాన్ని కేజీహెచ్ మార్చురీకి తరలించి, భద్రపరిచారు. సుమారు 45 నుంచి 50 ఏళ్ల మధ్య వయసు ఉంటుందని, ఆయన వద్ద ఎలాంటి ఆధారాలు లభించకపోవడంతో గుర్తు తెలియని వ్యక్తి మృతిగా కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. బంధువులు ఎవరైనా ఉంటే ఆరిలోవ పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాల్సిందిగా కోరారు.

క్రీడల్లో కేజీహెచ్ ఉద్యోగుల ప్రతిభ

జగదాంబ: క్రీడల్లో ప్రతిభ కనబరిచిన కేజీహెచ్ క్రీడాకారులను సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద్ ఆదివారం అభినందిచారు. ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ స్పోర్ట్స్ బోర్డు ఆధ్వర్యంలో ఈ నెల 14 నుంచి 21 వరకు చెన్నైలో వాలీబాల్, అథ్లెటిక్స్ పోటీలు జరిగాయని, వాటిలో కేజీహెచ్ నుంచి వాలీబాల్, 400, 800 మీటర్ల పరుగు పందెంలో వి.శాంతి, రాధారాణి ప్రతిభ చూపి పతకాలు సాధించారని శివానంద్ తెలిపారు. జాతీయ స్థాయిలో సిబ్బంది గెలుపొందడంపై ఆయన ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డాక్టర్ సంధ్యాదేవి, డిప్యూటీ కలెక్టర్, అడ్మినిస్ట్రేటర్ బి.వి.రమణ, పద్మ, కల్పన, మౌళి, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

జనావాసాల మధ్యలో మద్యం మాల్..?

- నివాస గృహంలో వాణిజ్య వినియోగం
- కూటమి ప్రభుత్వం తీరుపై స్థానికుల అసహనం

బీచ్‌రోడ్డు: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మద్యం ఎక్కడికక్కడ ఏరులై పారుతోంది. ఇప్పుడు మాల్ రూపంలో పెద్ద మద్యం దుకాణం జనావాసాల మధ్యలో పెట్టడానికి చకచకా పనులు జరుతున్నాయి. అది కూడా.. ఒడిశా గవర్నర్, తూర్పు నావికాదళ అధిపతి వంటి ప్రముఖులు నివసించే ప్రాంతంలో పెట్టడం చర్చనీయాంశమైంది. దీంతో స్థానికులంతా కూటమి ప్రభుత్వం తీరుపై అసహనం వ్యక్తం చేస్తున్నారు.

జీవీఎంసీ 28వ వార్డు రామ్‌నగర్‌లోని ప్రభుత్వ అతిథి గృహం ఎదురుగా ఉన్న తూర్పు నావికాదళం అధిపతితోపాటు నగరంలోని ప్రముఖులు నివాసం ఉండే దసపల్లా హిల్స్ ప్రాంతంలో మద్యం మాల్ ఏర్పాటు చేస్తున్నారు. అది కూడా ఒక నివాస అపార్ట్‌మెంట్‌ను వాణిజ్య స్థలంగా మార్చుతూ స్టాక్ పాయింట్‌గా రూపొందిస్తున్నారు. ఇలా ఒక నివాస గృహాన్ని వాణిజ్య స్థలంగా మార్చాలంటే జీవీఎంసీ అనుమతులు తప్పనిసరి. అయితే సదరు వ్యక్తులు అటువంటి అనుమతులు ఏమీ తీసుకోలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇలా నివాస గృహాల మధ్య మద్యం మాల్ ఏర్పాటు చేయడమేంటని ప్రశ్నిస్తున్నారు. తక్షణమే దీన్ని నిలుపుదల చేయాలని కోరుతున్నారు.



దసపల్లా హిల్స్ ప్రాంతంలో మద్యం దుకాణం కోసం సిద్ధం చేస్తున్న నివాస భవనం

మొక్కలు మాయం

ఏయూక్యాంపస్: ప్రతిష్టాత్మకంగా చేపట్టిన బ్యూటిఫికేషన్ పనులు నిర్లక్ష్యం కారణంగా నిరుపయోగంగా మారిపోతున్నాయి. గతంలో విశాఖలో నిర్వహించిన జీ-20 సమ్మిట్ సమయంలో బీచ్ రోడ్డుతోపాటు నగరంలోని పలు ప్రధాన ప్రాంతాల్లో వర్టికల్ గార్డెన్ తరహాలో మొక్కలు ఏర్పాటు చేశారు. ముఖ్యంగా వీటిని గెడ్డల వద్ద నిర్మించారు. మురుగు నీరు ప్రవహించే ప్రదేశాలను మూసివేస్తూ ప్రజలకు కొంత ఆహ్లాదాన్ని పంచేలా ఈ మొక్కల కుండీలను వరుసల్లో ఏర్పాటు చేశారు. వీటికి నీరు సరఫరా చేయడానికి వీలుగా డ్రిప్ సిస్టమ్‌ను కూడా అప్పుడే రూపొందించారు. కొన్ని నెలలు వీటి నిర్వహణ సక్రమంగానే జరిగింది. నగరానికి వచ్చే సందర్శకులు, స్థానికులు ఎంతో సుందరంగా కనిపించే ఈ మొక్కల వద్ద ఫొటోలు సైతం తీసుకునే వారు. ప్రస్తుతం వీటి నిర్వహణను పూర్తిగా గాలికొదిలేశారు. దీంతో మొక్కలు చనిపోగా.. కుండీలు ఖాళీగా దర్శనమిస్తున్నాయి. కుండీల్లో మట్టి ఫుట్‌పాత్‌లపైకి పడిపోయి అధ్వానంగా కనిపిస్తోంది. ఉద్యానవన విభాగం సిబ్బంది దృష్టి సారించి కుండీల్లో కొత్త మొక్కలు నాటితే అవి పూర్వ వైభవం సంతరించుకుంటాయని పలువురు స్థానికులు కోరుతున్నారు.



బీచ్ రోడ్డులో మొక్కలు లేక ఖాళీగా కనిపిస్తున్న కుండీలు

పేదల బతుకు పోరుపై చిత్ర ప్రదర్శన



చిత్ర సమీక్ష చేస్తున్న వైజాగ్ సినీఫైల్స్ సభ్యులు



ఐ, డేనియల్ బ్లేక్ చిత్ర ప్రదర్శన

ఏయూక్యాంపస్: వైజాగ్ సినీఫైల్స్ ఆధ్వర్యంలో ఆదివారం బీచ్ రోడ్డులో ఐ, డేనియల్ బ్లేక్ చిత్ర ప్రదర్శన, సమీక్ష నిర్వహించారు. ప్రముఖ దర్శకుడు కెన్ లోచ్ ఈ చిత్రానికి దర్శకత్వం వహించారు. అరు పదుల వయసు కలిగిన హృద్రోగ బాధితుడైన కార్పెంటర్ ప్రభుత్వం నుంచి తనకు రావాల్సిన సంక్షేమ పథకం కోసం చేసే పోరాటం ఇతివృత్తంగా ఈ చిత్రాన్ని నిర్మించారు. దరఖాస్తు విధానం అంతా ఆన్‌లైన్‌లోకి మారడం, అధికారుల నుంచి సరైన స్పందన కరువవడం, సాయం అవసరమైన వారి పరిస్థితి, ఇబ్బందులను అద్దం పడుతూ ఈ చిత్రాన్ని రూపొందించారు. చిన్న కారణాలను చూపుతూ ప్రజలకు అందాల్సిన సంక్షేమాన్ని, సాయాన్ని నిలిపివేయడాన్ని ఇక్కడ చూపారు. అనంతరం వైజాగ్ సినీఫైల్స్ సభ్యులు చిత్ర సమీక్ష జరిపారు. సమాజ రుగ్మతలకు కారణంగా నిలుస్తున్న పెట్టుబడిదారీ విధానంపై చర్చించారు.

పట్టణంలో పల్లె వాతావరణం



ఏయూక్యాంపస్: పల్లె వాతావరణం లాంటి దృశ్యం పట్టణంలో కనిపించింది. సాయం సంధ్యా సమయంలో ఎర్రని సూరీడు ఇంటి ముఖం పడుతున్నాడు. మేత కోసం వచ్చిన పశువులు తమ గూటి వైపు సాగుతున్నాయి. పల్లెల్లో నిత్యం కనిపించే ఈ సుందర దృశ్యం 'సాక్షి' కంటపడింది. పని ముగించుకుని ఇంటి బాట పడుతున్న ప్రజలు కూడా ఈ చిత్రంలో కనిపిస్తున్నారు. నిత్యం రణగొణ ధ్వనులతో గడిపే నగర వాసులకు ఇటువంటి దృశ్యాలు ఎంతో ఆహ్లాదాన్ని అందిస్తాయి.

– ఫొటో: సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

సాధనతో సజావుగా జీవిత పయనం



ప్రవచిస్తున్న పరిపూర్ణానంద స్వామీజీ

మద్దిలపాలెం: మానవ జీవితం సజావుగా సాగేందుకు సాధన ఎంతో అవసరమని పూజ్యశ్రీ పరిపూర్ణానంద స్వామి ప్రవచించారు. మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో విశాఖ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో సాధన రహస్యం అంశం మీద స్వామి వారి ప్రవచన కార్యక్రమం రెండో రోజు ఆదివారం ఆధ్యాత్మిక భావంతో సాగింది. స్వామీజీ మాట్లాడుతూ మనిషి జీవితం వివిధ తాపత్రయాలతో ముడిపడి ఉంటుందని, వాటికి తాత్కాలిక ఉపశమనం, శాశ్వత పరిష్కారం రెండు విధాలుగా లభిస్తుందని వివరించారు. ఉపశమనాల నుంచి పరిష్కారం దిశగా మారేందుకు ఆధ్యాత్మిక శక్తి మాత్రమే తోడ్పడగలదని చెప్పారు. వదలడం కాకుండా ఎదగడం వేదాంత ఉద్దేశమని అద్భుతంగా ఉదహరించారు. మహాత్ములందరూ ఈ బాటలోనే నడిచి, వారు తరించి, మనకు ఉద్బోధించారని తెలిపారు. వాహనాలు నడవడానికి ఇంధనం ఎంత అవసరమో.. జీవితం సజావుగా సాగేందుకు సాధన అంతే అవసరమని పేర్కొన్నారు. కళాభారతి ట్రస్ట్ అధ్యక్షుడు ఎంఎస్ఎన్ రాజు, కార్యదర్శి డాక్టర్ గుమ్ములూరి రాంబాబు, డాక్టర్ చిట్టిపంతులు ముఖ్య అతిథులుగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేశారు.

నాణ్యమైన పరిశోధనలతోనే విశ్వవిద్యాలయానికి గుర్తింపు



ఏయూ వీసీ రాజశేఖర్‌కు జ్ఞాపిక అందజేస్తున్న వర్సిటీ అలుమ్ని ప్రతినిధులు



నూతన వీసీ రాజశేఖర్‌కు అభివాదం చేస్తున్న రీసెర్చ్ స్కాలర్స్

విశాఖ విద్య: విశ్వవిద్యాలయంలో జరిగే పరిశోధనలు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో వర్సిటీకి ఎనలేని గుర్తింపును తీసుకొస్తాయని ఆంధ్రా యూనివర్సిటీ నూతన వీసీ ఆచార్య జి.పి.రాజశేఖర్ అన్నారు. ఆదివారం తన కార్యాలయంలో తనను మర్యాదపూర్వకంగా కలిసిన పరిశోధకులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. నాణ్యమైన పరిశోధనలతో విశ్వవిద్యాలయానికి మంచి పేరుప్రతిష్టలు తీసుకురావాలని ఆకాంక్షించారు. భవిష్యత్తును, అవకాశాలను నిర్ణయించేది పరిశోధనలేనని, వాటి కోసం పూర్తి సమయాన్ని, మేధస్సును వినియోగించాలని సూచించారు.

ఏయూ వీసీకి అభినందనలు

వీసీ రాజశేఖర్‌ను పూర్వ విద్యార్థుల సంఘం అభినందించింది. ఏయూ పూర్వ విద్యార్థుల సంఘం చైర్మన్ కె.వి.వి.రావు, వైస్ చైర్మన్ డాక్టర్ కె.కుమార్ రాజా, జనరల్ సెక్రెటరీ ఆకుల చంద్రశేఖర్, ఈసీ మెంబర్ డాక్టర్ ఎస్.కె.ఇ.అప్పారావు తదితరులు మర్యాదపూర్వకంగా కలిసి వీసీకి అభినందనలు తెలిపారు. గాయత్రీ విద్యా సంస్థల కార్యదర్శి ఆచార్య పి.సోమరాజు ఏయూ వీసీని కలిసి అభినందించారు. ఇన్‌స్టిట్యూట్ ఫర్ డెవలప్‌మెంట్ స్టడీస్ ఆంధ్రప్రదేశ్ ప్రతినిధుల బృందం వీసీ రాజశేఖర్‌తో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. పలువురు విశ్రాంత ఆచార్యులు ఆయనను అభినందించారు.కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా సీతారామ సేవా సంఘం ఎన్నికలు



క్యూలో నిల్చుని ఓటు వేస్తున్న స్థానికులు

మద్దిలపాలెం: జీవీఎంసీ 15వ వార్డు పాత వెంకోజిపాలెం శ్రీ సీతారామ సేవా సంఘం నూతన కార్యవర్గ ఎన్నిక ఆదివారం ప్రశాంతంగా జరిగింది. మొత్తం 124 ఓట్లతోపాటు సీనియర్ సిటిజన్ కింద 8 ఓట్లతో 132 ఓట్లు ఉండగా.. సీనియర్ సిటిజన్ 6, బ్యాలెట్ ఓట్లు 123 పోలింగ్ జరిగాయి. సంఘ అధ్యక్ష పదవికి పోటీ పడిన ఐదుగురు అభ్యర్థుల్లో కె.వెంకట సూర్య అప్పారావు తన సమీప అభ్యర్థి పాలమరశెట్టి త్రినాథ్‌పై 18 ఓట్ల మెజారిటీతో ఘన విజయం సాధించినట్లు ఎన్నికల అధికారి కర్రి నరేంద్రకుమార్ ప్రకటించారు. కె.వి.ఎస్.అప్పారావుకు 56 ఓట్లు, పాలమరశెట్టి త్రినాథ్‌కు 38, ఆదారి పరదేశినాయుడుకు 33, కాళ్ల ఆనంద్‌కు 2 ఓట్లు లభించగా.. కాళ్ల అప్పలరాజుకు ఒక్క ఓటు కూడా దక్కలేదు. సాయంత్రం నిర్వహించిన కార్యక్రమంలో నూతన అధ్యక్షుడు కె.వి.ఎస్.అప్పారావు ఇతర కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా మళ్ల పోలిరాజు, ఉపాధ్యక్షుడిగా పెంటకోట ప్రకాష్, ప్రధాన కార్యదర్శిగా బొడ్డేటి రామకృష్ణ, కార్యదర్శిగా కర్రి రవికుమార్, కోశాధికారిగా యల్లపు శ్రీను, సహాయ కార్యదర్శులుగా కర్రి రఘు, కర్రి గోవింద, ఆడిటర్‌గా కాళ్ల అప్పలరాజు, ప్రచార కార్యదర్శిగా ఆదారి శివప్రకాష్ ఎన్నికయ్యారు. వీరంతా ఏడాది కాలం పాటు తమ పదవిని కొనసాగించనున్నారు. కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ మళ్ల అప్పలరాజు, పీలా వెంకట పరదేశినాయుడు, గవర కార్పొరేషన్ డైరెక్టర్ మళ్ల రవికుమార్, ఇతర గ్రామస్తులు పాల్గొన్నారు.

సముద్ర స్నానం.. జాగ్రత్త ముఖ్యం



సాగర తీరంలో హెచ్చరిక బోర్డు వద్దే స్నానాలు చేస్తున్న నగరవాసులు

ఏయూక్యాంపస్: ప్రమాదమని తెలిసినా నగరవాసులు సముద్ర స్నానాలు చేస్తున్నారు. ఆదివారం సాయంత్రం పెద్ద సంఖ్యలో నగరవాసులు సముద్ర స్నానాలకు వచ్చారు. విక్టరీ ఎట్ సీ ఎదురుగా వందలాది మంది నగరవాసులు తమ కుటుంబ సభ్యులతో కలిసి సముద్ర స్నానాలు చేశారు. తమ వెంట ఆహార పదార్థాలు తెచ్చుకుని వీరు మధ్యాహ్నం అక్కడే భోజనాలు ఆరగించారు. చిన్న పెద్ద కలిసి సముద్ర స్నానాలు చేస్తూ సందడి చేశారు. వీరు హెచ్చరిక బోర్డులు ఉన్న ప్రాంతంలో స్నానాలు చేయడం, సముద్రంలో లోతుగా ఉన్న ప్రాంతంలో ఈత కొట్టడం చూపరులను ఆందోళన కలిగించింది. జాగ్రత్తలు తీసుకుని ఇటువంటి స్నానాలు చేయాలని పలువురు సూచిస్తున్నారు.

చిన్నా.. జరభద్రం

ఏయూక్యాంపస్: వాహనాలపై చిన్నారులను తీసుకెళ్లే సమయంలో ఎంతో జాగ్రత్త వహించాలి. ముఖ్యంగా ద్విచక్ర వాహనాలపై వెళ్లే సమయంలో మరింత జాగ్రత్తగా ఉండాలి. వారికి వాహనంపై కూర్చోవడం తెలియదు. ఎటువంటి చిన్న ప్రమాదం జరిగినా కష్టాన్ని భరించడం సాధ్యం కాదు. ఆదివారం ఇటువంటి దృశ్యం నగరంలో కనిపించింది. ఒక వ్యక్తి తన చిన్నారిని ద్విచక్ర వాహనం వెనుకవైపు తిరిగి కూర్చోపెట్టుకున్నాడు. మరో చిన్నారి సీటుపై నిలుచున్నాడు. వీరిద్దరిని సమన్వయం చేస్తూ వాహనం నడపడం ఎంతో కష్టతరమైన విషయం. ఏ మాత్రం చిన్న పట్టు తప్పినా అందరికీ ప్రమాదం జరిగే అవకాశముంటుంది. చిన్నారులతో ఇటువంటి విన్యాసాలు చేయడం సరికాదని స్థానికులు సూచిస్తున్నారు.



– ఫొటో: సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

వైభవంగా విజయగణపతి కల్యాణోత్సవం





గణపతి కల్యాణం నిర్వహిస్తున్న రుత్వికులు, తిలకిస్తున్న భక్తులు

ఏయూక్యాంపస్: కిర్లంపూడి లేఅవుట్‌లోని శ్రీ విజయ గణపతి ఆలయ వార్షికోత్సంలో భాగంగా ఆదివారం సాయంత్రం సిద్ధి, బుద్ధి సమేత విజయ గణపతి కల్యాణం వైభవంగా నిర్వహించారు. రుత్వికులు వివాహ ఘట్టాలను వివరిస్తూ జరిపించిన విధానం అందరినీ ఆకట్టుకుంది. విశాఖ ప్రాముఖ్యత, ప్రాశస్త్యం వివరిస్తూ గణపతి వివాహాన్ని కళ్లకు కడుతూ జరిపించారు. భక్తులంతా ఆనంద పారవశ్యంతో వివాహ ఘట్టాన్ని తిలకించి, పులకించారు. ఉదయం గణపతి పూజ, పుణ్యాహవచనంతో కార్యక్రమాలు ప్రారంభించారు. అనంతరం ఆలయ కలశాభిషేకం జరిపారు. సాయంత్రం స్వామి కల్యాణం నిర్వహించారు. రెండు రోజుల ఉత్సవాలు ఘనంగా ముగిశాయి. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. శ్రీపాల్ టవర్స్ నిర్వాసితులు, స్థానికులు పాల్గొన్నారు.